సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 11 । జూలై । 2024



సక్రమంగా మెనూ అమలు

పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు 8లో

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. అనంతరం నిత్యకల్యాణం నిర్వహించారు.



హుండీ ఆదాయం లెక్కింపు

ఎర్నిమాంబ ఆలయంలో హుండీల ద్వారా రూ. 21,03,182 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వంద వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వచ్చిన వినతులను ఆన్‌లైన్ చేసి, అర్జీదారులకు రసీదులు అందజేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. వరదల సమయంలో అధికారులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదలకు సంబంధించి డివిజన్ స్థాయిలో తనకు సమాచారం ఇవ్వాలని, ఐటీడీఏ కార్యాలయం నుంచి కోరే సమాచారానికి సంబంధించిన వివరాలను వెంటనే అందజేయాలని పీవో ఆదేశించారు.

ఏపీ జెన్‌కో సీలేరు ఇన్‌చార్జి ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ రెడ్డి

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విభాగం ఇన్‌చార్జి ఎస్ఈగా చంద్రశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎస్ఈగా పనిచేస్తున్న కె.కె.వి. ప్రశాంత్‌కుమార్‌కు ఏపీ జెన్‌కో హెడ్‌ఆఫీస్‌కు బదలీ అయింది. ఈ నేపథ్యంలో సీలేరు పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈగా పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు.ఈ మేరకు ఎస్ఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

సత్వరమే భూ సమస్యల పరిష్కారం

సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రాజవొమ్మంగి: భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. మండలంలోని బడదనాంపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్తుల నుంచి భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ ఎ.ఎస్.వి.సత్యనారాయణకు సూచించారు. ప్రతి బుధవారం మండలంలోని ఒక గ్రామంలో రెవెన్యూ సదస్సును తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అనంతరం అదే గ్రామంలో పాఠశాలను సబ్‌కలెక్టర్ సందర్శించారు. అక్కడ విద్యార్థుల పఠనాసామర్థ్యాన్ని పరిశీలించారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీని సందర్శించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. డాక్టర్ సుష్మను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎ.ఎస్.వి.సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

లైంగికదాడి ఘటనపై ఏఎస్పీ విచారణ



లైంగికదాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

ఎటపాక: మండలంలోని గొరీదేవిపేటలో నాలుగేళ్ల బాలికపై ఆదివారం జరిగిన లైంగికదాడి ఘటనపై చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బుధవారం స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి విచారణ జరిపారు. గ్రామంలో ఘటనాస్థలాన్ని పరిశీలించి, బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం సాక్షులను విచారించారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను చింతూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు క్షుణ్ణంగా విచారణ జరుపుతున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయగౌరి,ఎటపాక సీఐ రామారావు,ఎస్ఐ కె.పార్థసారథి, వీఆర్వో కన్నమ్మ పాల్గొన్నారు.

డ్రాప్ ఆట..!

‘ధర్మవరపు దివ్య పెందుర్తి మండలం వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివింది. ఈ ఏడాది తమ స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా పలాస స్కూల్లో 6వ తరగతి చేరేందుకు వెళ్లింది. గత నెల 17న ఇక్కడి పాఠశాలలో టీసీ ఇచ్చేసినా, సదరు విద్యార్థిని పేరు డ్రాప్‌బాక్స్‌లో కనిపించకపోవటంతో పలాసలోని స్కూల్లో ఇప్పటి వరకు రికార్డుల్లో నమోదు చేయలేదు. దీంతో స్టూడెంట్ కిట్ అందలేదు.’ ఇలాంటి వారు ఇంకెందరున్నారో...

- ఫీజు బకాయిల కోసం ఎత్తుగడలు
- టీసీలు ఇచ్చినా డ్రాప్‌బాక్స్‌లో కనిపించని పేర్లు
- వేరే పాఠశాలలో చేరేందుకు ఆటంకం
- యు–డైస్ ప్లస్‌లో నమోదుకు సాంకేతిక చిక్కులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- ఈ విద్యా సంవత్సరంలో తేలని అడ్మిషన్లలెక్క



విద్యార్థులు

విశాఖ విద్య: విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థి తనకు నచ్చిన స్కూల్లో చేరి, నిరభ్యంతరంగా చదువుకోవచ్చు. కానీ, కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు ఫీజు బకాయిలు వసూళ్ల కోసం వారిని వేరే చోట చేరనివ్వకుండా ఆటంకాలు కలిగిస్తున్నారు. మీ ఇష్టం వచ్చిన స్కూల్‌కు వెళ్లిపోవచ్చని పైకి చెబుతున్నా, విద్యార్థుల పేర్లను డ్రాప్ బాక్స్‌లో ఉంచకపోవటంతో మరో స్కూల్లో వారి పేర్లు నమోదుకు సాంకేతికంగా ఇబ్బంది ఎదురవుతుంది. సాంకేతిక సమస్యతో ప్రభుత్వ స్కూళ్లలో కూడా యు–డైస్ ప్లస్‌లో విద్యార్థుల పేర్లు నమోదు సవ్యంగా సాగటం లేదు. దీంతో 2024–25 విద్యా సంవత్సరంలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారనే స్పష్టమైన లెక్క తేలడం లేదు.

డ్రాప్‌బాక్స్ అంటే..

ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు మారే సందర్భంలో ఆ స్కూల్ నిర్వాహకులు విద్యార్థి పేరును చైల్డ్ ఇన్ఫో నుంచి తొలగిస్తారు. దీంతో విద్యార్థి పేరు ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో గల డ్రాప్‌బాక్స్‌లోకి చేరుతుంది. వేరొక స్కూల్లో జాయిన్ అయిన తరువాత, అక్కడ మళ్లీ నమోదు చేయటానికి, ముందు చదివిన స్కూల్లో నిర్వాహకులు విద్యార్థి పేరును వారి పాఠశాల యు–డైస్ కోడ్ నుంచి తొలగించి, ఆ పేరును డ్రాప్‌బాక్స్‌లో ఉంచాలి. అలా అయితేనే డ్రాప్‌బాక్స్ నుంచి క్లియర్ అవుతుంది. కానీ కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



తమ సమస్యను చెప్పుకుంటున్న విద్యార్థి బంధువులు

సంక్షేమ పథకాలు దూరమే..

యు–డైస్‌లో నమోదైన విద్యార్థికే గుర్తింపు ఉంటుంది. ప్రభుత్వ పరంగా అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయి. బడులు తెరిచి నెల రోజులు కావస్తున్నా చాలా స్కూళ్లలో విద్యార్థులు వివరాలు నమోదు నిర్లక్ష్యం తాండవిస్తోంది. విద్యార్థులంతా ఏదో ఒక పాఠశాలలో చదువుతున్నారని విద్యాశాఖాధికారులు చెబుతున్నా.. యు–డైస్ ప్లస్‌లో లేనందున వారికి హాజరు నమోదు కాదు. ఇలానే కొనసాగితే విద్యార్థులకు ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందించేటప్పుడు సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి.

ఎంఈవోల పర్యవేక్షణ ఏదీ

డ్రాప్‌బాక్స్ సమస్యలపై తల్లిదండ్రుల నుంచి అందే ఫిర్యాదులపై సీరియస్‌గా స్పందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి, డ్రాప్‌బాక్స్ నుంచి వారిని క్లియర్ చేసేలా ఎంఈవో స్థాయిలో వెసులుబాటు ఉంది. కానీ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న దిగువస్థాయి విద్యాశాఖాధికారులు ఇవేమీ పట్టించుకోవటం లేదని, అందువల్లనే తమ పిల్లల పేర్లను డ్రాప్‌బాక్స్‌లో కనిపించకుండా చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలి



విద్యార్థులు నచ్చిన స్కూల్లో చదువుకోవచ్చు. కానీ కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజు వసూలు కోసమని టీసీలు సకాలంలో ఇవ్వటం లేదని మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వాటిపై పరిశీలన చేస్తున్నాం. విద్యాశాఖాధికారులు సమస్యను పరిష్కరించేందుకు దృష్టి పెట్టాలి. ఇలాంటి వాటిపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగానే పరిగణిస్తోంది.

– డాక్టర్ జి.సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు



ఫీజుల కోసమని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకూడదు. అలాంటి యాజమాన్యాలపై కఠినంగానే వ్యవహరిస్తాం. ఈ ఏడాది అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నాం. యు–డైస్ ప్లస్‌లో విద్యార్థుల పేర్లు నమోదుతోపాటు డ్రాప్‌బాక్స్ ఉన్న వారి వివరాలను వెంటనే క్లియర్ చేయాలని జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నిర్వాహకులకు ఆదేశించాం.

– బి.విజయభాస్కర్, ఆర్జేడీ

గంజాయి నియంత్రణకు చర్యలు

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సాక్షి,పాడేరు: ఎవరూ గంజాయి జోలికి వెళ్లవద్దని, పిల్లలను ఆ ఊబిలో దింపవద్దని రాష్ట్ర గిరిజన సంక్షేమ,స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం ఆమె పర్యటించారు. ముందుగా ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మతల్లి పాదాల గుడి,పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించి, మోదకొండమ్మ చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.అనంతరం కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు అల్లూరి జిల్లా నుంచే గంజాయి సరఫరా అవుతోందని దుష్ప్రచారం జరుగుతోందని చెప్పారు. 100 రోజుల్లో గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, సరిహద్దు ఒడిశాలో గంజాయి పంట ఎక్కువగా ఉన్నందున ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించి గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జిల్లాలో 2.50 లక్షల గిరిజన కుటుంబాలు కాఫీని సాగుచేస్తున్నాయని, అరకు కాఫీని అభివృద్ధి చేయడం ద్వారా గంజాయి సాగును తగ్గించవచ్చన్నారు.గతంలో వలే ఐటీడీఏ నుంచి గిరిజనులకు 16 పథకాల అమలు, ట్రైకార్ రుణాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో విద్య, వైద్యం,తాగు,సాగునీటి రంగాలతో పాటు రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో పూర్తిగా గంజాయి సాగు నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటల సాగు,గిరిజనుల జీవనోపాధి మెరుగుకు రూ.144కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్టు చెప్పారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో 7,500 ఎకరాల్లో గంజాయి సాగు ఉండేదని, ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గత మూడేళ్లలో గంజాయి తోటలను ధ్వంసం చేశామన్నారు.గంజాయి సాగు చేస్తున్న రైతులపై కేసులు నమోదు చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించినట్టు చెప్పారు. దీంతో గంజాయి సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు.ఈ సమావేశంలో జేసీ భావన వశిష్ట, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్,జీసీసీ ఎండీ సురేష్‌కుమార్,డీఆర్వో పద్మావతి,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి,గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఎస్ఈబీ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి సంధ్యారాణి విలేకరులతో మాట్లాడుతూ గిరిజనాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆశ్రమపాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమిస్తామని, ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయుడిగా మారిన అరకు ఎమ్మెల్యే

మాదల పాఠశాలలో పాఠాలు బోధించిన మత్స్యలింగం



మాదల పాఠశాలలో పాఠాలు చెబుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: మండలంలో మాదల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలను ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బుధవారం సందర్శించారు. కొంతసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. బోధనలో ఉపాధ్యాయులు రాజీ పడరాదని చెప్పారు. గ్రామాభివృద్ధి విద్యతోనే సాధ్యపడుతుందని తెలిపారు. అనంతరం గన్నెల పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొర్రా గాసి, పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కమ్మిడి అశోక్, సర్పంచ్ బి.బొజ్జి, నాయకులు రామ్మూర్తి, రామరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సూపర్ ఫిఫ్టీ బోధన


- ఆశ్రమ పాఠశాలల్లో సంకల్పం, విద్యా,వినోదం, వికాసం అమలు
- ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: టెన్త్ విద్యార్థులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి సూపర్ ఫిఫ్టీ ప్రత్యేక బోధన తరగతులను ప్రారంభిస్తున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో సీట్లు సాధించాలన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు, పలు పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గత ఏడాది తొలి విడత నిర్వహించిన సూపర్ ఫిఫ్టీ శిక్షణను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. శిక్షణ పొందిన 32 మంది బాలికల్లో 22 మంది కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో సీట్లు సాధించారని, 20 మంది బాలురులో 15 మంది స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో సీట్లు సాధించారని చెప్పారు. కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో సీట్లు పొందిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తారన్నారు. ఇకపై ప్రతి నెల ఆశ్రమ పాఠశాలల్లో సంకల్పం, విద్యా, వినోదం, వికాసం పేరిట విద్యార్థులకు వారం,వారం వివిధ అంశాలపై డిబేట్, వ్యాస రచన పోటీలను నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు మండల స్థాయిలో, మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు ఐటీడీఏ స్థాయిలో పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రతివారం విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే సినిమాలను ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ ఏడాది సూపర్ ఫిఫ్టీలో గుత్తులపుట్టు బాలికల పాఠశాలలో 29 మంది బాలికలు, దిగుమోదాపు ట్టు ఆశ్రమ బాలుర పాఠశాలలో 21 మంది బాలురకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో రజిని పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



వలలు ఉచితంగా అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

అడ్డతీగల: అందుబాటులో ఉన్న నీటి వనరుల్లో చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య విభాగం శాస్త్రవేత్త కె.వీరాంజనేయులు తెలిపారు. మల్లవరం మామిళ్ళు వద్ద మద్దిగడ్డ జలాశయం మత్స్యకార రైతులతో కలసి బుధవారం మత్స్య రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దిగడ్డ జలాశయంలో ఉన్న కెజి కల్చర్ ద్వారా చేపపిల్లల ఉత్పత్తి,ముఖ్యమైన చేప జాతి రకాలైన బొచ్చు,రవ్వ,కొర్ర మేను వంటి చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు.కెజి కల్చర్‌లో చేప పిల్లల ఉత్పత్తి చేపట్టిడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త లలితా కామేశ్వరి తెలిపారు. 80 కిలోల చేపలు పట్టే వలలను ఉచితంగా గిరిజన మత్స్యకారులకు పంపిణీ చేశారు. కేవీకేశాస్త్రవేత్తలు క్రాంతికుమార్,ప్రవీణపాల్గొన్నారు.

గిరి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



నెదర్లాండ్స్ బృందంతో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: జిల్లాలో గిరిజన రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సూచించారు. నెదర్లాండ్ రెడీస్ స్వచ్ఛంద సంస్థ బృందం సభ్యులు బుధవారం పీవోను కలిశారు. జిల్లాలో గ్రామీణ వికాస కేంద్రం ద్వారా పత్తి సాగును అభివృద్ధి చేసేందుకు తీసుకోనున్న చర్యలను పీవోకు వివరించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో ఆర్గానిక్ కాటన్‌ను నాలుగు వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్టు చెప్పారు. ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాల్లో పదివేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు వారు వివరించారు. స్వీట్ ఆరెంజ్ మొక్కలు, పత్తి జిన్నింగ్ కోసం మిషనరీ ఏర్పాటు, పసుపు, జీడిపప్పు మార్కెటింగ్ తదితర అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా దబ్బ, నిమ్మ, కొబ్బరి, జాఫ్రా, మామిడి, మునగ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మొక్కల సంరక్షణ కోసం ఉపాధి హామీ పథకం ద్వారా నగదు అందజేస్తున్నట్టు చెప్పారు. గ్రామీణ వికాస సంస్థ ద్వారా ఎక్కడెక్కడ ఆర్గానిక్ పత్తి అభివృద్ధి చేయనున్నారో ప్రతిపాదనలు ఇవ్వాలని, ఐటీడీఏ ద్వారా పూర్తి సహకారం అందిస్తామని పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు విలియం, లూడ్, యోమి, యోస్ట్ అనిల్ కుమార్, మీనాల్, రోనాల్డ్, విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

110 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మి

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం 110 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.లక్ష్మి తెలిపారు. స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమం ప్రతి నెలా రెండో వారంలో రెండు రోజులు జరుగుతుందన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా ఆశ వర్కర్లు,ఏఎన్ఎంలు కృషి చేయాలన్నారు.

నాగుపాము హతం



హతమైన నాగుపాము

గూడెంకొత్తవీధి: కాఫీ తోటల్లో పనులు చేస్తుండగా లంకపాకలు వద్ద ఏడడుగుల నాగుపాము గిరిజనులకు కనిపించింది. దీంతో పలువురు భయంతో కేకలు పెట్టి వరుగులు తీశారు. విషయం తెలుసుకున్న కాఫీ కార్మికులు కొందరు పామును గిరిజనులు హతమార్చారు. నాగుపాము సుమారు ఏడు అడుగులు ఉన్నట్టు వారు చెప్పారు.

జి.మాడుగులలో కుండపోత



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం కుండపోతగా వర్షం కురిసింది. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి రోడ్లు జలమయమయ్యాయి.జాతీయ రహదారి నిర్మాణ పనులు,పలు ప్రభుత్వ, ప్రైవేటు కాంట్రాక్టు నిర్మాణ పనులకు వర్షం వల్ల ఆటకం కలిగించింది. పంట పొలాల్లోకి నీరు చేరింది.

జన విశాఖి

- రాష్ట్రంలోనే అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లా ఇదే..
- చదరపు కి.మీకి 1,670 మంది నివాసం
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

సాక్షి, విశాఖపట్నం: మహా నగరం.. జనసంద్రమవుతోంది. ఓ వైపు అలలతో అలరారుతున్న సాగరం.. మరోవైపు ప్రజలతో కిటకిటలాడుతోంది. రాష్ట్రంలో అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాగా విశాఖపట్నం నిలిచింది. అత్యధిక జనాభా ఉన్న జిల్లాల జాబితాలో రెండో స్థానంలో ఉంది.

ప్రపంచ నగరాలు, దేశంలోని మెట్రో సిటీలతో పోటీ పడుతున్న విశాఖ నగరం.. అపారమైన అవకాశలతో అందరికీ ఆహ్వానం పలుకుతోంది. పారిశ్రామికీకరణ, విద్యా సంస్థలు, పర్యాటకం, మౌలిక సదుపాయాలు, జీవన నాణ్యత తదితర అంశాలు ఇక్కడ స్థిరపడేందుకు ఆకర్షిస్తున్నాయి. అందుకే దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు విశాఖపట్నాన్ని తమ డెస్టినేషన్‌గా మార్చుకుంటున్నారు. అందుకే ఈ జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాగా మారింది. జిల్లాలో చదరపు కి.మీకి 1,670 మంది నివసిస్తుండటం గమనార్హం.

రాష్ట్రంలో రెండో జిల్లాగా...

జనాభా పరంగా రాష్ట్రంలో రెండో జిల్లాగా విశాఖపట్నం నిలిచింది. జూలై 7 నాటికి 24,69,712 జనాభాతో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా.. 23,85,658 మందితో విశాఖపట్నం జిల్లా రెండో స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే 2.32 శాతం జనాభా విశాఖ జిల్లాలో పెరిగింది. విస్తీర్ణ పరంగా అత్యంత చిన్న జిల్లాగా 1048 చ.కిమీ తో ఉన్న విశాఖపట్నం.. జనాభా, జనసాంద్రత విషయంలో మాత్రం అందనంత ఎత్తులో ఉండటం విశేషం. అనకాపల్లి జిల్లాలో 17,26,998 మంది జనాభా ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 9,53,960 మంది నివిస్తున్నారని ఏయూ జన గణన విభాగం వెల్లడించింది. జనసాంద్రత విషయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా 77 మందితో అట్టడుగున నిలిచింది.

జిల్లా	జనాభా
విశాఖ	23,85,658
అనకాపల్లి	17,26,998
అల్లూరి	9,53,960

నాలుగో పరిశోధన కేంద్రం

భారత ప్రభుత్వం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 18 జనాభా పరిశోధన కేంద్రాలు స్థాపించింది. వీటిలో 1956 ఢిల్లీలో స్థాపించిన జనాభా పరిశోధన కేంద్రం మొట్టమొదటి కాగా 1989 సాగర్(మధ్యప్రదేశ్) లో స్థాపించింది ఆఖరిది. ఈ క్రమంలో 1977లో ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన జనాభా పరిశోధన కేంద్రం నాల్గోది. ఈ కేంద్రాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన అనేక ఆరోగ్య కార్యక్రమాలు ఏ విధంగా అమలవుతున్నాయో పరిశీలించడం, పని తీరుకు సంబంధించి పరిశోధన చేయడం, తద్వారా వివిధ ఆరోగ్య పథకాలు, కార్యక్రమాల్లో ఎటువంటి మార్పుల అవసరం గుర్తించి ప్రభుత్వాలకు నివేదిక అందజేస్తాయి. జనాభా పెరుగుదలపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్య పరచడంలో దోహద పడే విధంగా ఈ కేంద్రాల వద్ద డిజిటల్ జనాభా గడియారాలను ఏర్పాటు చేశారు. డిజిటల్ క్లాక్‌పై దేశ, రాష్ట్ర జనాభా వివరాలు ప్రత్యక్ష ప్రసారమవుతాయి.



ఏయూలో ఏర్పాటు చేసిన డిజిటల్ జనాభా గడియారం

వాహనం అదుపుతప్పి ఒకరు మృతి: ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన బోదెమ్మ

సీలేరు: గూడెం కొత్తవీధి మండలంలోని కమ్మరితోట వద్ద బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. వై.రామవరం మండలం చాపరాయికు చెందిన బోదమ్మ, లక్ష్మారెడ్డి, బోదరాజులు డొంకరాయిలో తమ బంధువుల ఇంటికి బుధవారం ఉదయం వెళ్లారు. తిరిగి చాపరాయి బయలుదేరారు. ధారకొండ పంచాయతీ కమ్మరితోట వద్దకు వచ్చేసరికి వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో బోదమ్మ తలకు తీవ్రగాయం కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వీరిని హుటాహుటిన వేరే వాహనంలో ధారకొండ పీహెచ్‌సీకు తరలించారు. అయితే ఆస్పత్రికి తీసుకెళ్లే సమయానికి బోదమ్మ(50) మృతిచెందినట్టు వైద్యాధికారి నాగభూషణం తెలిపారు. బోదమ్మ మృతదేహాన్ని ప్రైవేటు వాహనంలో స్వగ్రామం చాపరాయి తీసుకెళ్లారు. బైక్ వేగంగా వెళ్లడంతో అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

అడ్డతీగల: మండలం చిన్నవడిశక్ర వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దబ్బపాలెంకి చెందిన జర్తా నాగమణి(60) అనే వృద్ధురాలు మృతి చెందింది. దీనికి సంబంధించి దుశ్చర్తి ఎస్‌ఐ లతాశ్రీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలు నాగమణి తమ బంధువుల ఇంటికి చిన్నవడిశక్ర వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అటుగా మోటార్ సైకిల్‌పై ముగ్గురు యువకులు అతి వేగంగా వచ్చి ఆమెను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు పాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ఉన్న దుశ్చర్తికి చెందిన పి.లవుడు, పి.కుసుడు, పి.శివ అనే యువకులు గాయలు పాలవ్వడంతో 108 వాహనంలో దుప్పులపాలెం పీహెచ్‌సీకి తరలించారు.కాగా ప్రమాదంలో మృతిచెందిన జర్తా నాగమణి మృతదేహాన్ని అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లతాశ్రీ చెప్పారు.

నేలకూలిన భారీ వృక్షం

గంటపాటు నిలిచిన రాకపోకలు



కందమామిడి జంక్షన్ సమీపంలో నేలకూలిన వృక్షం

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రం పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో కందమామిడి జంక్షన్ సమీపంలో బుధవారం ఉదయం ఓ భారీ వృక్షం నేలకూలింది. కొద్ది రోజులగా కురుస్తున్న వర్షాలు,గాలుల ప్రభావంతోనే ఈచెట్టు కూలినట్టు స్థానికులు తెలిపారు.రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో ఇరువైపులా గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది.ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు ఆదేశాలతో సిబ్బంది పొక్లెయిన్ సహాయంతో చెట్టును తొలిగించారు.దీంతో మైదాన ప్రాంతాలకు వాహనాల రాకపోకలు కొనసాగాయి.

హుండీ ఆదాయం లెక్కింపు

కంచరపాలెం(విశాఖ): జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి హుండీలు లెక్కించారు. 50 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ. 21,03,182 వచ్చినట్టు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీబీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా మెనూ అమలు

హుకుంపేట: పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని పెదగరువు ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ నేపథ్యంలో బాలికలకు భోజనాలను వడ్డించి విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా పీవో అభిషేక మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులుకు సికెల్‌సెల్ అనీమియ పరీక్షలపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని తదితరులున్నారు.

800 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్టు
- రెండు వాహనాల సీజ్



గంజాయి కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: వేర్వేరు ప్రాంతాల్లో చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు రూ.40 లక్షల విలువచేసే 800 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బుధవారం తెలిపారు. ఒడిశా నుంచి మోతుగూడెం మీదుగా మధ్యప్రదేశ్‌కు వ్యాన్‌లో తరలిస్తున్న 550 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్ గిరి, శివదయాళ్, అలోక్‌గోతంను అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, ఒడిశాకు చెందిన ఒకరు పరారీలో ఉన్నారని ఆయన తెలిపారు. మరో కేసుకు సంబంధించి మంగంపాడు నుంచి హైదరాబాదుకు కారులో తరలిస్తున్న 250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మజ్జి వెంకటసుమంత్‌ను అరెస్టు చేశామని, తెలంగాణకు చెందిన ఇద్దరు పరారీలో ఉన్నారని ఏఎస్పీ తెలిపారు. స్మగ్లర్లు తప్పుడు సమాచారంతో కార్లను అద్దెకు తీసుకుని గంజాయి రవాణాకు పాల్పడుతున్నారని, ఇలాంటి వారిపట్ల వాహనాల యజమానులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, మోతుగూడెం ఎస్‌ఐ గోపాలరావు పాల్గొన్నారు.

అరకు ఎంపీని సత్కరించిన పెన్షనర్లు



ఎంపీ డాక్టర్ తనూజారాణిని సత్కరిస్తున్న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లు

డాబాగార్డెన్స్(విశాఖ): ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ విశాఖ శాఖ 5వ జిల్లా మహాసభ బుధవారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనూజారాణి పాల్గొని మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పెన్షనర్లు ఆమెకు అందజేశారు. అనంతరం డాక్టర్ తనూజారాణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్స్, పి. ఆడమ్స్, ఏఐబీడీపీఏ సర్కిల్ సెక్రటరీ కేఎస్‌సీ బోస్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ కె. రామాంజనేయలు, సీజీపీఏ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం(విశాఖ): శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంఠధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరం పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. హరినామస్మరణ మార్మోగింది.

ఆటో బోల్తా పడి గిరిజనుడికి గాయాలు



ఆటో కింద చిక్కుకున్న పాడి వెంకటరమణ



కాలికి తీవ్రగాయాలైన దృశ్యం

అనంతగిరి: గుమ్మ పంచాయతీ చెరుకుబిడ్డ–కరివేసు రోడ్డులోని మర్రివలస గ్రామ సమీపంలోని ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టిన ప్రమాదంలో ఓ గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలివి. ఎస్‌కోట నుంచి కరివేసు పాఠశాలకు ఐరెన్ గేట్లు, డోర్లు లోడ్‌తో ఆటోలో వస్తుండగా మర్రివలస సమీపంలోని వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ఐరెన్ గేట్లు కింద కాలి ఉండిపోవడంతో కరివేసు గ్రామానికి చెందిన పాడి వెంకటరమణ (27) గాయపడ్డాడు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని ప్రైవేటు వాహనంలో ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

అధ్వాన రోడ్డు కారణంగా ప్రమాదం

చెరుకుబిడ్డ నుంచి పోర్లువలస వరకు రూ.85 లక్షలతో ఫార్మేషన్ రోడ్డును, కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా నిర్మించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, మాజీ ఏపీసీఎస్ పాడి కృష్ణమూర్తి తెలిపారు. రోడ్డంతా అధ్వానంగా మారిందని, వర్షాకాలం కావడంతో వాహనాలు జారిపోతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి, పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు



ఆశ్రమ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తరగతుల నిర్వహణ, అందజేస్తున్న ఆహారం, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. పిల్లల కోసం వండిన ఆహారాన్ని ఆయన పరిశీలించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు క్లాసులు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు.

మొక్కలు నాటి భావితరాలకు భవిష్యత్తు ఇద్దాం



జోలాపుట్టులో విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న బీఎస్ఎఫ్ ఎస్‌ఐ ముఖేష్‌కుమార్

ముంచంగిపుట్టు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావితరాలకు భవిష్యత్తును ఇద్దామని జోలాపుట్టు బీఎస్ఎఫ్ 65 బెటాలియన్ ఎస్‌ఐ ముఖేష్‌కుమార్ అన్నారు. ప్లాంటేషన్ డ్రైవ్ –2024లో భాగంగా ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న బీఎస్ఎఫ్ 65 బెటాలియన్ పోలీసు బలగాలు బుధవారం జోలాపుట్టు జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ముఖేష్ కుమార్ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం రత్నకుమార్, ఉపాధ్యాయులు రామన్న, కొండపడాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరంపై అక్కసు

- డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై టీడీపీ నాయకుల దాడులపై సర్వత్రా నిరసనలు
- పచ్చ నేతల దౌర్జన్యాన్ని ఖండించిన రాజకీయ పక్షాలు, సంఘాలు
- ఇది పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణన
- వీరి దుశ్చర్యకు నిరసనగా ఆందోళనకు సిద్ధమవుతున్న జర్నలిస్టు యూనియన్లు



బీచ్‌రోడ్డులోని డెక్కన్ క్రానికల్ కార్యాలయం ఎదుట బ్యానర్‌ను తగులబెడుతున్న తెలుగునాడు మహిళలు

విశాఖ సిటీ: 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అన్న సామెత తెలుగుదేశం ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. చినబాబు రెడ్ బుక్ పేరుతో ఐఏఎస్, ఐపీఎస్‌లపై బెదిరింపులకు పాల్పడుతుంటే.. టీడీపీ పిల్ల బ్యాచ్ విచక్షణా రహితంగా భౌతిక దాడులకు తెగబడుతోంది. నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రశ్నించిన మీడియా సంస్థలపై బ్యాన్ విధించాలని ప్రయత్నించి.. హైకోర్టు మొట్టికాయలతో చంద్రబాబు ప్రభుత్వం వెనక్కు తగ్గింది. తాజాగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ కథనం ప్రచురించిన డెక్కన్ క్రానికల్ పత్రికా కార్యాలయంపై టీడీపీ నేతలు భౌతిక దాడికి తెగబడడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తోంది. బీచ్ రోడ్డులో ఉన్న జాతీయ పత్రికా కార్యాలయంలోకి టీడీపీ విద్యార్థి విభాగం నేతలు దూసుకుపోయి రాళ్లతో దాడి చేయడం, డెక్కన్ క్రానికల్ బోర్డుకు నిప్పు పెట్టడం పెను దుమారం రేపుతోంది. అక్షరాల గొంతు నులిమి.. పత్రికా స్వేచ్ఛను హరించి.. రాష్ట్రంలో రాక్షస పాలనకు చంద్రబాబు ప్రభుత్వం నాంది పలికింది. పచ్చనేతల ఈ దుశ్చర్యను పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు, సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

మీడియా అణచివేతకు ప్రభుత్వ పన్నాగం

రాష్ట్రంలో మీడియాను తన చెప్పు చేతల్లో పెట్టుకోడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వామపక్ష పార్టీలు, జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు మెరుగైన సేవలందించి వారి అభిమానం పొందాల్సిన నేతలు ప్రతీకారంతో, అధికార బలంతో మీడియాపై దాడులు చేస్తూ బలపడాలనుకోవడం సరికాదని హితవు పలుకుతున్నాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న మీడియా, పత్రికలపై దాడులకు పూనుకోవడాన్ని ఖండిస్తున్నాయి. ప్రజల కోసం వినియోగించాల్సిన అధికారాన్ని మీడియా నోరు నొక్కేందుకు ఉపయోగించే వికృత సంస్కృతి సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వాదనలో నెగ్గలేని వారే భౌతిక దాడులకు దిగుతారనడానికి ఇదే ఉదాహరణగా పేర్కొంటున్నాయి. తమకు వ్యతిరేకంగా మాట్లాడినా, రాసినా అంతు చూస్తామంటూ ప్రజాస్వామ్య సంస్థలను బెదిరిస్తూ నియంతలా వ్యవహరించడం ప్రభుత్వానికే మంచిది కాదని సూచిస్తున్నాయి. పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అవుతుందని పునరుద్ఘాటిస్తున్నాయి. ఇదే పద్ధతి కొనసాగితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నాయి.

దాడి అప్రజాస్వామికం: సీపీఎం నేత కె.లోకనాథం

అనకాపల్లి: విశాఖ నగరంలోని డెక్కన్ క్రానికల్ ఆంగ్ల దిన పత్రిక కార్యాలయంపై టీడీపీ విద్యార్థి విభాగం నాయకులు, టీడీపీ కార్యకర్తలు చేసిన దాడి అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై డెక్కన్ క్రానికల్లో వచ్చిన వార్తను తట్టుకోలేని టీడీపీ కార్యకర్తలు ఆ పత్రిక కార్యాలయంపై రాళ్లు విసిరి, సంస్థ బోర్డును తగలబెట్టి దాడులకు పాల్పడడం పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనన్నారు. దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాసిన పత్రికా కార్యాలయాలపైన, జర్నలిస్టులపైన దాడులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలగకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. ఈ తరహా దాడులను ప్రభుత్వాలు నియంత్రించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

రంగురాళ్ల తవ్వకాలు చట్టరీత్యా నేరం



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ అప్పలసూరి, అటవీ అధికారులు

గూడెంకొత్తవీధి: గిరిజనులు రంగురాళ్ల తవ్వకాలకు దూరంగా ఉండాలని గూడెంకొత్తవీధి సీఐ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ అప్పలసూరి, అటవీశాఖ పెదవలస రేంజ్ అధికారి శివరంజనితో కలిసి రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడుతున్నట్టు గుర్తించిన పలువురు గిరిజనులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వ్యాపారుల ప్రోత్సహంతో సిగనాపల్లి కొండపై తరచూ కొందరు గిరిజనులు రంగురాళ్లు తవ్వుతున్నట్టు తాము గుర్తించామన్నారు. రక్షిత అటవీ ప్రాంతంలో ఎటువంటి తవ్వకాలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రంగురాళ్ల తవ్వకాలు చట్టరీత్యా నేరమన్నారు. తవ్వకాలకు పాల్పడుతున్నట్టు గుర్తించిన 14 మందిని తహసీల్దారు వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ అప్పలనాయుడు తెలిపారు.